క్లుప్తంగా

క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఒత్తిడి దూరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఒత్తిడి దూరమవుతుందని రవీంద్రభారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ గొల్లపూడిలోని విజయవాడ రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్, విద్యా సంస్థల జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్ సరళ, అకడమిక అధికారి జ్యోతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు అన్నారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో ఎన్నికైన ఎంప్లాయిస్ సంఘ్ స్టేషన్ బ్రాంచ్ వైస్ చైర్మన్లు ఎస్.శ్రీహరి లత, అసిస్టెంట్ సెక్రటరీ డి.మాధవీలత మంగళవారం డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి ముందుండాలని, భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వస్త్రలత క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 23వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అసోసియేషన్ హాల్లో రెండు వేర్వేరు హాస్పటల్స్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంజే నాయుడు హాస్పటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలపై వన్‌టౌన్ బీఆర్పీ రోడ్ ఇస్లాంపేటలోని అయాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, పుష్పా హోటల్ సెంటర్‌లోని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నేతృత్వంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు జరుగుతాయని వివరించారు.

ఆరు నెలల చిన్నారి, తల్లి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆరు నెలల చిన్నారి, తల్లి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం ఆంజనేయ స్వామి గుడి ప్రాంతానికి చెందిన మంగపట్ల సమ్మయ్య, ఈశ్వరి భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. ఆరు నెల కుమార్తె సువార్తకు కొద్ది రోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఈశ్వరి ఇంటికి శివ అనే యువకుడు వచ్చాడు. అతను తనకు దూరపు బంధువని ఆమె చెప్పింది. పాపను చికిత్స కోసం తీసుకువెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఈశ్వరి ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. దీంతో ఆందోళన చెందిన భర్త తన భార్య, పాప కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్ట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గంజాయి కలిగి ఉన్న ఇద్దరు యువకులతో పాటు మరో బాలుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం మంగళవారం రైల్వే అప్‌యార్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆరా తీశారు. చిట్టినగర్‌కు చెందిన మాతంగి భార్గవ్(23), కుప్పాల ఠాగూర్(19), మరో బాలుడు వద్ద ఉన్న సంచిలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు.ముగ్గురిని స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు బాలుడిని జువెనైల్‌హోంకు తరలించారు.

భవిష్యత్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులదే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవిష్యత్ అంతా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులదేనని సమున్నతి టీం సభ్యులు పేర్కొన్నారు. నగరంలోని ఏఓ అసోసియేషన్ హాలులో ప్రకృతి వ్యవసాయ ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో సమున్నతి టీఎం సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. టీం సభ్యులు రాజ వల్లభనేని, ప్రవేశ శర్మ , సాయిప్రసాద్, సోమయాజులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే విధానాన్ని వివరించారు. ఇందులో భాగంగా ఎంటర్ ప్రెన్యూర్స్ అనుభవాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఓ విజయకుమారి, సీనియర్ తెమెటిక్ మార్కెటింగ్ ప్రభాకర్, రీజినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, పార్థసారథి, నాగమల్లీశ్వరి, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యువ రైతులు పాల్గొన్నారు.



నగరంలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ వీడ్కోలు సభ జరిగింది. సభలో పాల్గొన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ, గ్రంథాలయ పరిషత్ జిల్లా చైర్మన్ జమలపూర్ణమ్మ కలిశారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మారనున్న బడి రూపురేఖలు

- రూ.2.5 కోట్లతో డీఎస్‌ఎం స్కూల్ నూతన భవన నిర్మాణం
- జీ ప్లస్ టు భవనంలో 20 తరగతి గదులు
- నాడు–నేడు కింద మరో రూ.80 లక్షలు



డీఎస్‌ఎం పాఠశాల స్థలం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నాడు నేడు పనులతో కొన్నిచోట్ల బడుల రూపురేఖలు మారగా, కొన్నిచోట్ల వేగంగా పనులు జరుగుతున్నాయి విద్యాధరపురంలోని మారయ్య హోటల్ సెంటర్‌లో దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్(డీఎస్‌ఎం)కు మహర్దశ పట్టనుంది. ఈ స్కూల్.. రోడ్డు కంటే పల్లంలో ఉండటంతో వానొస్తే పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి ఎదురయ్యేది. ఈ పాఠశాల ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పాఠశాలకు అదనపు హంగులు అద్దనున్నారు. ఈ పనుల్లో భాగంగా శిథిలావస్థకు చేరిన పాఠశాల పాత భవనాన్ని పడగొట్టడానికి విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. దీనికి సమగ్ర శిక్ష అభియాన్ రూ.2.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. నూతన భవనంలో మొత్తం 20 తరగతి గదులు నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన బడి నాడు – నేడు కార్యక్రమం రెండో దశలో స్కూల్‌లో మౌలిక వసతుల కల్పనకు మరో రూ.80 లక్షలను కేటాయించింది. దీంతో అధునాతన భవనం, అందులో ప్రభుత్వం కల్పించిన పది రకాల మౌలిక వసతులతో డీఎస్‌ఎం హైస్కూల్ రూపురేఖలు మారనున్నాయి. 1938లో బ్రిటిష్ పాలకులు నిర్మించిన భవనంలో ఒక పక్క విద్యాధరపురం విలేజ్ రేడియో స్టేషన్ మరో పక్క మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఉండేవి. 1970లో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. ప్రస్తుతం ఈ హైస్కూల్‌లో 6 నుంచి నుంచి 10వ తరగతి వరకు విద్యా బోధన జరుగుతోంది. మొత్తం 20 మంది ఉపాధ్యాయులు (ఇందులో 13 మంది ఉపాధ్యాయునులే), 15 సెక్షన్‌లు ఉన్న హైస్కూల్‌లో సుమారు 600 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు.



ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న అదనపు గదుల భవనం

తాత్కాలికంగా అదనపు తరగతి గదుల్లోకి..

ఇక్కడి పాఠశాలలో తరగతి గదులు చాలకపోవడంతో రూ.37లక్షల వ్యయ అంచనాతో ఈ స్కూల్‌కు సమీపంలోని మైలపల్లి పోలీస్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ప్రాంగణంలో అదనపు తరగతి గదులు (గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్) నిర్మించారు. అయితే ఉన్న స్టాఫ్ అటూ ఇటూ తిరగటం సాధ్యంకాక వాటిని వినియోగించుకోలేదు. తర్వాత ఆ గదుల్లో సచివాలయాల్లో ఏర్పాటుచేసినా తర్వాత వాటిని అక్కడ నుంచి మార్చారు. అవి ఖాళీగా ఉండటంతో డీఎస్‌ఎం హైస్కూల్ నూతన భవనం నిర్మించే వరకు దానిలో స్కూల్‌ను నిర్వహించేందుకు వీఎంసీ మరో రూ.27 లక్షల వ్యయ అంచనాతో సెకండ్ ఫ్లోర్ నిర్మించింది. ప్రస్తుతం స్కూల్‌ను తాత్కాలికంగా అక్కడికి తరలించి బోధన చేస్తున్నారు.

అధికారుల ఆదేశాల మేరకు తాత్కాలిక తరలింపు

డీఎస్‌ఎం హైస్కూల్ భవనం పురాతనమైనది కావటం.. నగరపాలక సంస్థ విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు దగ్గరలో ఉన్న అదనపు తరగతుల భవనంలోకి తాత్కాలికంగా ఇటీవల తరలించాం. ప్రస్తుతం విద్యార్థులకు ఇక్కడే విద్యా బోధన చేస్తున్నాం. విద్యారంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతా క్రమంలో సరికొత్త హంగులతో నూతన భవన నిర్మాణం చేపట్టడం శుభ పరిణామం.

– మాతంగి కోటయ్య, ప్రధానోపాధ్యాయుడు

ప్రపంచ పర్యాటక కేంద్రంగా అంబేడ్కర్ స్మృతివనం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఆనంద ప్రకాష్, కాలే పుల్లారావు



స్మృతివనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యులు ఆనంద ప్రకాష్, కాలే పుల్లారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ పర్యాటక కేంద్రంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఆనంద ప్రకాష్, కాలే పుల్లారావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం పనులను మంగళవారం సాంఘిక సంక్షేమ అధికారులతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ
రూ.268 కోట్ల నిధులతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా దేశంలోనే అత్యంత భారీ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఇప్పటికే పెడస్టల్ పనులు పూర్తయ్యాయని, కన్వెన్షన్ పనులకు సంబంధించి బేస్మెంట్, ఫ్లోరింగ్ పనులు పూర్తిచేశారన్నారు. ఏప్రిల్ 14వ తేదీ బీ ఆర్ అంబేడ్కర్ జయంతి రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారని ఆయన తెలిపారు. విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు సీఎం వైఎస్ జగన్, మంత్రి మేరుగ నాగార్జునకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయభారతి, దళిత నాయకులు బూదల శ్రీను, నలకుర్తి రమేష్, కాలే వెంకటరమణరావు, లేళ్లపూడి లాజర్ తదితరులు ఉన్నారు.

సందడిగా దొంగలదోపు ఉత్సవం



దొంగలదోపు ఉత్సవంలో ఆదిదంపతులు, పక్కన కమిటీ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో మంగళవారం రాత్రి దొంగలదోపు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పాతశివాలయం, శ్రీ వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్దువారి గుడి) ఆలయాల శివరాత్రి కల్యాణోత్సవాలు శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా ఆయా ఆలయాల స్వామి వార్లను అన్నసత్రం కమిటీ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ ఇంటి వద్ద దొంగలదోపు ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత పాత శివాలయం, బుద్దు వారి గుడి నుంచి ఆదిదంపతుల ఉత్సవ మూర్తులను గ్రామోత్సవంతో తీసుకొచ్చారు. అనంతరం సాహితీవేత్తలు డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్ నేతృత్వంలో దొంగల దోపు కార్యక్రమం సంప్రదాయబద్ధంగా సాగింది. అమ్మవారి పక్షాన పాలపర్తి శ్యామలానందప్రసాద్, స్వామి వారి పక్షాన ఇతర సాహితీవేత్తలు పరస్పరం సంవాదంతో రక్తి కట్టించారు. వివాహ సమయంలో పెండ్లికుమార్తె ఇంటి నుంచి కొన్ని విలువైన వస్తువులను పెండ్లి కుమారుని తరఫువారు దొంగిలించారని ఆరోపణతో ఆరంభమైన ఈ సంవాదం వినోదాత్మకంగా సాగింది. ఏటా మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు అనంతరం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వల్లంకొండ ప్రసాద్, జగన్మోహనగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న పొంగలి షెడ్డు



ఇంద్రకీలాద్రిపై ఘాట్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్న పొంగలి షెడ్డు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు పొంగలి ప్రసాదం సిద్ధం చేసేందుకు అవసరమైన గ్యాస్ పొయ్యిలను దేవస్థానం అందుబాటులోకి తీసుకురానుంది. దేవస్థాన ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద నిరుపయోగంగా ఉన్న షెడ్డును వినియోగంలోకి తీసుకురావాలని దేవస్థానం నిర్ణయించింది. రెండేళ్ల కిందట ఇక్కడే భక్తులు అమ్మవారికి పొంగలి వండేందుకు పొయ్యిలను అందుబాటులో ఉంచింది. గతంలో ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సురేష్‌బాబు పొంగలి షెడ్డును మహా మండపం దిగువకు తరలించి ఈ షెడ్డులో క్లోక్ రూమ్ నిర్వహించారు. ఆ షెడ్డును కాలక్రమంలో తొలగించడంతో ఆరు బయటే భక్తులు పొంగలి వండేవారు. ఇటీవల దేవస్థాన పాలక మండలి కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబుకు పలువురు భక్తులు పొంగలి షెడ్డు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పొంగలి షెడ్డును తిరిగి ఏర్పాటు చేయాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను కోరారు. షెడ్డును శుభ్రం చేసి 20 గ్యాస్ పొయ్యిలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో షెడ్డున ప్రారంభించవచ్చని తెలుస్తోంది.


యువతకు స్ఫూర్తి మహాకవి శ్రీశ్రీ



విజయవాడ కల్చరల్: యువతలో కవితా స్ఫూర్తిని నింపిన మహాకవి శ్రీశ్రీ అని కవి ప్రసాదమూర్తి అన్నారు. రెడ్ బుక్‌డే సందర్భంగా ప్రజాశక్తి బుక్ హౌస్ బాలోత్సవ భవన్‌లో మంగళవారం మహాప్రస్థానం కవితా పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన కవిత్వం ద్వారా సమాజాన్ని కదిలించిన కవి శ్రీశ్రీ అన్నారు. ఆయన మహా ప్రస్థాన కావ్యం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యాజీ శ్రీశ్రీ కవితా రీతులు అంశంగా ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులు లక్ష్మయ్య పాల్గొన్నారు. పలువురు కవులు మహాప్రస్థానంలోని కవితా ఖండికలను గానం చేశారు.

అదనపు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రొఫెసర్ జయశంకరప్రసాద్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతోపాటు అదనపు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ జయశంకరప్రసాద్ చెప్పారు. నలంద డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ సంస్థ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. విద్యార్థులకు అజూర్ ఫండమెంటల్, జావా, పైథాన్, సెక్యూరిటీ ఫండమెంటల్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగించి, రాత పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్స్ అందజేశారు. ముఖ్యఅతిథిగా కృష్ణా విశ్వ విద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సీహెచ్ జయశంకర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఈ కోర్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ 53 మంది బీఎస్సీ విద్యార్థులు మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ కోర్సులో శిక్షణ పొందగా సర్టిఫికెట్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్



ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలించి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా మంగళవారం ఆయన ప్లాంట్‌లో జరుగుతున్న పనుల పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో కాల్–ఆన్ ఇండస్ట్రీస్ నిర్వహణలోని చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి టోల్ గేటు మాదిరిగా ఈ ప్రాంతంలో కూడా భూమ్ బ్యారియర్ (ఆర్ఎఫ్ఐడీ రేడియో ఫ్రిక్వెన్సి) ఏర్పాటు చేయాలనీ సూచించారు. అనంతరం ఆయన రాజీవ్ నగర్‌లోని వీఎంసీ విభాగాధిపతుల సారథ్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించి అందులో ఉన్న వసతి సదుపాయాలను పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణరావు, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనువ్రత్ సందేశం ఆచరణీయం



ర్యాలీని ప్రారంభిస్తున్న కమలేష్‌కుమార్‌శర్మ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో శాంతిస్థాపనకు విలువల పరిరక్షణకు అనువ్రత్ సందేశం ఆచరణీయమని ఆదాయపన్నుల శాఖ విజయవాడ డివిజన్ వార్డు–2 అధికారి కమలేష్‌కుమార్‌శర్మ అన్నారు. అనువ్రత్ సమితి విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో ఆ సంస్థ 75వ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాల నుంచి పాతబస్తీ పూలబావివీధిలోని జైన్ దేవాలయం వరకూ ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అనువ్రత్ సందేశాలైన నైతిక విలువలు, వ్యసన విముక్తి, సమాజంపై ప్రేమ, పరస్పరం గౌరవించుకోవడం అంశాలు సమాజంలో శాంతిని స్థాపిస్తాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారిణి సీవీ రేణుక, శ్రీ జైన్ శ్వేతాంబర్ తేరాపంత్ సమాజానికి చెందిన గురువులు ముని దీప్‌కుమార్, ముని కావ్యకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సమితి విజయవాడ శాఖ అధ్యక్షులు రాజేంద్రకొఠారి, కార్యదర్శి నిర్లేష్, విమల్ బైద్, నరేంద్ర నెహేతా, తేరాపంత్ సభ అధ్యక్షుడు అశోక్ బాగ్రేచ, గిసులాల్ జైన్, ప్రవీణ్ జైన్, సంజయ్ చాజేర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలతో వెలంపల్లి, భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వెలంపల్లి సాయి అవనీష్ మెమోరియల్ నాకౌట్ టీ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో ట్రికో సీసీ జట్టు విజేతగా నిలిచింది. పశ్చిమ నియోజకవర్గం 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ సహకారంతో పోలవరపు సత్తి పది రోజులుగా విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్స్ మంగళవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజేత ట్రికో సీసీ జట్టుకు రూ.25వేలు, ట్రోఫీ, రన్నర్ సెత్తి సీసీ జట్టుకు రూ.15వేలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, ఆర్గనైజర్లు దుర్గారావు, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మాతృభాషపై పట్టు సాధించాలి



బహుమతులు సాధించిన విద్యార్థులతో అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఎంఎస్ఆర్ హైస్కూల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాషతో అన్నిరంగాల్లో సాధికారత సాధించడానికి అవకాశముంటుందన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సమరం మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషలోనే ఆలోచిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు – వెలుగు అంశంపై నిర్వహించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మురళీమోహన్, పాఠశాల కార్యదర్శి అమరసుధీర్ ప్రధానోపాధ్యాయిని శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సీఐ స్వరాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం మత్తుపదార్థాల వినియోగిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ అందరూ గర్వించేలా ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. ఎస్ఐ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా యువత వ్యక్తిగత జీవితంతోపాటు వారి కుటుంబం కూడా అష్టకష్టాలు పడుతుందని తెలిపారు. అనంతరం సీఐ రాజ్యలక్ష్మిని సత్కరించారు. ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకునేలా విద్యాబోధన



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వృత్తి విద్యను అభ్యసించే వారిలో నైపుణ్యాలు పెంచేలా రిసోర్స్‌పర్సన్స్ విద్యాబోధన చేయాలని ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ వి.హిమబిందు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రైనింగ్ సెంటర్లల్లో రీసోర్స్ పర్సన్స్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మంగళవారం సంస్థ ఆవరణలో జరిగింది. ఆమె మాట్లాడుతూ నేడు మారుతున్న అవసరాల దృష్ట్యా వృత్తి విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాబోధన సాగాలని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్నా, సంస్థ డైరెకర్స్, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం భక్తబృందం ఆధ్వర్యాన భజన జరిగింది. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.